

# రాధామోహనం

## - దేవరకొండ అన్నపూర్ణ



9 *ఇది ఒక అందమైన రాధామోహనగాథ. మనందరిలోను అంతర్లీనంగా ఉండి కాలప్రవాహంలో పడి మరిచిపోతున్న ప్రేమాభిమానాలనీ అనుభూతులని గుర్తు చేస్తూ, మనల్ని నవ్విస్తూ, అప్పుడప్పుడూ కళ్ళని చెమరుస్తూ, పనిలోపనిగా మరిచిపోతున్న విలువల్నీ మనుషులుగా మన బాధ్యతలనీ తట్టిలేపే కథామాలిక..!!*

## పరుగాపక పయనించవే

**శనివారం పొద్దున్నే** మోహన్ టెన్నిస్ కి బయల్దేరగానే, పనులన్నీ పూర్తి చేస్కుని ఫ్రెష్ అయ్యి కూర్చుంది రాధ, తన వారాంతపు విరామం – మాస్ట్రో ఇళయరాజా పాటలు వింటే కానీ తృప్తిగా ఉండదు అనుకుంటూ స్పాటిఫై ఆన్ చేసి పెరట్లోకి వచ్చింది. తొలి ఉషస్సులో వెచ్చని కాంతి, పిల్ల తెమ్మెరని తోడు తెచ్చుకుని వేడి, చల్లదనం ఒకదానితో ఒకటి దోబూచులాడుతున్నట్లుంది వాతావరణం. గ్రీన్ టీ పట్టుకుని కుర్చీలో కూర్చుంది రాధ.

తనకిష్టమైన పాట మొదలయ్యేసరికి, సన్నటి చిరునవ్వు మెరిసింది రాధ మొహంలో. ఎన్ని సార్లు విన్నా ఆలోచింపచేసే పాట – శివపూజకు చివురించిన సిరి సిరి మువ్వా – స్వర్ణ కమలం అనే ఆణిముత్యంలాంటి సినిమా , కె విశ్వనాథ్ గారి దార్శనికత, కళాకారిణి మనోమధనానికే అద్దం పట్టే పాటని 'కళావతి' రాగం లో కూర్చిన మాస్ట్రో, కలలకు కళలకు మధ్య సాగే వాదనకి వజ్రసమానమైన పదములు పేర్చిన సిరివెన్నెల, అందాన్నీ అభినయాన్ని కళ్ళతో పండించిన నవ యువతీ , ప్రేమనీ ఆరాధననీ ఆరాటాన్ని తపననీ ఒకేసారి చూపిస్తున్న యువకుడు – ఒకేసారి స్మృతి పథం లోకి మెరిశారు.

పరుగాపక పయనించవె తలపుల నావ
కెరటాలకు తలవంచితె తరగదు త్రోవ
ఎదిరించిన సుడిగాలిని జయించినావా
మది కోరిన మధుసీమలు వరించి రావా

ఎంత సుతిమెత్తని సంవాదం లాంటి వాదన – మనసనే పడవని వేగంగా ముందుకు పొమ్మని, అడ్డొచ్చే కెరటాలకు అడ్డంకులకూ బెదరద్దనీ, సుడిగాలిలా వచ్చే వ్యతిరేకతని జయించాలనీ, అనుకున్న పనిని సాధించాలనీ ఖచ్చితంగా చెప్పింది ఆ అమ్మాయి. అప్పటిదాకా సినిమాలో అమ్మాయి అమాయకత్వాన్నే చూపించిన విశ్వనాథ్ గారు ఆ అమ్మాయి దృఢ సంకల్పాన్ని సుశీలమ్మ గొంతులో ఖంగుమనిపించారా అన్నట్టుంటుంది ఈ పాట.

పాటని అంతరాయపరుస్తూ ఫోన్ మోగింది. సోనీ – తనకి వరసకి చెల్లెలు అవుతుంది. దూరపు చుట్టరికమైనా అమెరికా వచ్చాక కొంచెం రాకపోకలు అవీ పెరిగి బానే దగ్గరయ్యాం.

“అక్కా, ఎలా ఉన్నావ్? బిజీనా” అంది ఆపాలజిటిక్ గా

“లేదమ్మా చెప్పు , ఎలా ఉన్నావ్, పిల్లలు , సునీల్. అంతా బాగున్నారా. చాలా రోజులయ్యింది మాట్లాడి” అని కుశలప్రశ్నలు వేసింది.

“అంతా బాగున్నాం అక్కా” అంటూ తన కుశలప్రశ్నలు కూడా అయ్యాక

“ఎందుకో మాట్లాడాలనిపించిందక్కా” అంది నెమ్మదిగా. సోనీ గొంతులో వినిపించిన జీర రాధ దృష్టిని దాటి పోలేదు.

ఈ మధ్యే సిటిజెన్షిప్ కూడా వచ్చిందనీ, ఇల్లు కొనుక్కున్నాక ఇండియా వచ్చి వాళ్ల నాన్న షష్టి పూర్తి అదీ చేసారు అనీ వింది రాధ అమ్మ చెప్తుంటే. సోనీ గొంతులో తేడా విని అలర్ట్ అయ్యింది రాధ.

“ఏమ్మా ఏమైంది.. పిన్ని బాబాయ్ ఎలా ఉన్నారు? పిల్లలూ? అన్నయ్య, తమ్ముడు? ఏంటి అలా అన్నావ్” అంది రాధ.

“అంతా బాగున్నామక్కా”

కానీ ఏదో అలజడి స్పష్టంగా వినిపించింది ఆ అమ్మాయి గొంతులో.

‘చిన్నప్పటి నుంచి ఇద్దరు అబ్బాయిల మధ్య అల్లారు ముద్దుగా పెరిగింది సోనీ, ఐఐటీ లో చదివింది. బాగా చదువుకుని మంచి ఉద్యోగం చేస్తోంది. సునీల్ కూడా చాలా ప్రేమగా చూసుకుంటాడని, కాలు కందనివ్వడని పిన్ని చెప్పింది. క్రిందటి సంవత్సరం క్రిస్మస్ సెలవల్లో రాధ ఇంటికి వచ్చినప్పుడు కూడా పిల్లలు భర్త చాలా ఆనందంగా ఉన్నారని మోహన్ కూడా ముచ్చట పడ్డాడు, అందరం పోర్ట్రైట్లు తీయించుకున్నాం కూడా. ఇప్పుడు ఏంటీ పిల్ల బాధగా ఉంది’ అనుకుంది రాధ.

“ అక్కా, అంతా బానే ఉన్నాం, హడావిడి జీవితాలు – పిల్లల స్కూళ్ళు ఆఫీస్ పని ఇంటి పనితో రోజులు దొర్లిపోతున్నాయి. మా మధ్యే చిన్న అలజడి. దానిని నేను భరించలేకపోతున్నాను.

మొన్నఆ మధ్య నా ఆఫీస్లో ఒక కొలీగ్ జయేంద్ర నాతో లంచ్ సమయంలో మాట్లాడుతూ – తన భార్యతో ఏదో సమస్య ఉందని చెప్తుంటే, మనకెందుకులే అని నేను పట్టించుకోలేదు. ఆ తర్వాత కొన్నాళ్ళకి అతను భార్యతో సహా ఆఫీస్ ఇయర్ ఎండ్ పార్టీలో కనిపించాడు. ఆమె భర్తతో అందరిముందు ప్రవర్తించిన తీరుతో తన కళ్ళలో నీళ్లు చూసి తర్వాతరోజు నేనే అడిగితే వివరాలు చెప్పాడు. భార్యకి అనుమానం ఎక్కువనీ, బయట ఎవరితో మాట్లాడినా ఇంట్లో రణరంగం సృష్టిస్తుందనీ పార్టీలో తన టీం లో పని చేసే అమ్మాయి పలకరించిందని అలా గట్టిగా అరిచిందనీ చెప్పుకొచ్చాడు. పిల్లల కోసం సర్దుకుపోతున్నాను అని అంటే కౌన్సిలింగ్ కి వెళితే ఉపయోగం ఉండవచ్చనీ, కాదూ అని ఇలాగే ఉంటే పిల్లల మీద కూడా ఆ ప్రభావం పడుతుందనీ నాకు తోచిన మంచి మాటలు చెప్పాను కూడా.

అతని జేబులో కూడా రికార్డర్ పెట్టింది అతని భార్య. నా మాటలు విని నాకు కూడా ఆకాశరామన్నలా మెయిల్ చేసింది. మా మధ్యలోకి రాకు నీ భర్తకి చెబుతాను అంటూ. అయినా నాతో ఎనిమిదేళ్ళుగా పని చేస్తున్న అతనినే సపోర్ట్ చేశాను.

ఒకటి రెండు సార్లు సునీల్ తో అన్నాను. మేమిద్దరం భార్యభర్తల్లా కాక స్నేహితుల్లాగే ఉంటాం కనుక సునీల్ దగ్గర దాచే ప్రయత్నం ఏమీ చెయ్యలేదు. కానీ తను ఆ టాపిక్ కి పెద్ద ప్రాముఖ్యత ఇవ్వలేదు అలా అని నన్ను వద్దు అనలేదు. ఆ విషయాలన్నీ ఇంట్లో ఏకరువు పెట్టడం ఎందుకులే. జయేంద్ర స్వవిషయాలు కదా అని నేను పొడిగించలేదు.

మొన్నమా అమ్మాయి పుట్టినరోజుకి వాళ్ళ పిల్లల్ని తీసుకొచ్చాడు మా ఇంటికి జయేంద్ర. మాటల్లో సునీల్ తో

'మీ వైఫ్ చాలా విపత్కర సమయంలో ఆత్మహత్య అంచు వరకు వెళ్ళిపోయిన నాకు మంచి మాటలు చెప్పి నా బలం, సామర్థ్యం, పిల్లల బాధ్యత గుర్తు చేసి నన్ను మామూలు మనిషిని చేసారు ఒక అమ్మలా. ఏడు సంవత్సరాలనుంచీ డిప్రెషన్తో బరువు పెరిగిపోయి ఆరోగ్యం పాడు చేసుకున్న నేను తిరిగి కొత్త జీవితం మొదలు పెట్టాను. మీరిద్దరూ ఆదర్శ దంపతులు సర్ , మీ ఋణం తీర్చుకోలేను' అన్నాడట.

సునీల్ నవ్వి ఊరుకున్నాడు. పార్టీ అయిపోయాక సునీల్ నాతో

'నువ్వు సహాయం చేసావని కాదు. నాకు చెప్పలేదని బాధనిపించింది' అన్నాడు

"నేను చెప్పాను కానీ మీరు అంత ఇంటరెస్ట్ చూపించలేదు పైగా అతను నన్ను నమ్మి చెప్పిన అతని వ్యక్తిగత విషయాలు నేను అతని పరోక్షంలో మాట్లాడటం ఎంతవరకు సమంజసం తెలియక మాట్లాడలేదు" అన్నాను.

తర్వాత చాలా రోజులు ముభావంగా ఉన్నాడు. నేను అడిగితే

'అనుమానం లేదు. చెప్పి ఉంటే నేను కూడా ఓ చెయ్యి వేసేవాడిని' అన్నాడు సునీల్.

నేను అనవసరంగా బాధ పెట్టానేమో అనిపించింది. ఆ అలజడి అలాగే కొనసాగుతోంది అక్కా. నాకు సరిగ్గా గైడ్ చెయ్యగలదానివి నువ్వే అన్న నమ్మకంతో నీకు కాల్ చేస్తున్నా"

నెమ్మదిగా చెప్పింది సోనీ.

తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది రాధ. పొసెసివ్ నెస్ అనేది స్త్రీ సహజ గుణం అనుకుంటారంతా. అది మగవారిలో కూడా ఉంటుంది. అది ప్రేమ పరిధిలో ఉన్నంతవరకు అందంగా ఉంటుంది కానీ ఆ హద్దు దాటినప్పుడు అనుమానంగా మారి సున్నితమైన అనుబంధాన్ని ఛిన్నాభిన్నం చేస్తుంది. సునీల్ ది ప్రేమ అన్న పరిధిలోనే ఉంది అనిపించింది రాధకి.

' సోనీ, నువ్వు చేసిన పని తప్పు అనే గిల్ట్ నీకు అవసరం లేదు.

ప్రతీ మనిషి తన చుట్టూ గీసుకునే కళ్ళకి కనిపించని ఒక గిరిలో తన కుటుంబం, స్నేహితులు, తన విలువలు, తన నమ్మకాలు, తన అభిప్రాయాలు, దానితో పాటు తన పర్పస్ ఉంటాయి. కుటుంబం స్నేహితులూ ముఖ్యమే కానీ అన్నీ ఉన్నా మనందరికీ ఏదో లోటు ఉండనే ఉంటుంది చూడు. అదే జన్మ కారణం నెరవేరకపోవడం. మనకి ఎవరూ ఎదురుగా వచ్చి ఇది చేస్తే నీకు తృప్తిగా ఉంటుంది అని ఎవ్వరు చెప్పలేనిది మనకే తెలియని ఒక శూన్యత మనందరిలోనూ ఉంటుందమ్మా. మనం దాన్ని వెతుకుతూనే ఉంటాం. ఛారిటీలు, స్నేహితులకి సహాయాలు, ఇంట్లో పూజలు, ఎవరినైనా పిలిచి బట్టలు పెట్టడం, వెకేషన్లు, ఒకటేమిటి ఆత్మ సంతృప్తి కోసం, ఆ శూన్యతని పూడ్చడం కోసం వెతకని రోజుండదు. అదీ మనకి తెలీకుండానే.

అందరం కారణజన్ములమేనమ్మా. అందరికి ఒక పర్పస్ ఉంటుంది, ఉండాలి కూడా. జీవన ప్రయాణంలో ఎవరు ఎవరికీ ఎక్కడ ఆసరా అవుతారో మనకి తెలియదు. సమయం వచ్చినప్పుడు భగవంతుడు అలా ఒక్కొక్కరి ద్వారా కొన్ని పనులని నెరవేరుస్తాడు అంతే. మనం ఆ పని లో కేవలం పనిముట్లం మాత్రమే. ఇలాంటివి దైవ కార్యాలు మనకి తెలిసి కొన్ని, తెలియక కొన్నిజరిగిపోతుంటాయి. అలాంటిదే నువ్వు చేసిన సహాయం కూడా. నువ్వు ప్రతిఫలం అన్నది ఆశించకుండా చేసిన సహాయంలో భగవంతుడు ఉంటాడు. ఆ పుణ్యం పదింతలై నిన్ను, నీ కుటుంబాన్ని శ్రీ రామరక్షలా కాపాడుతుంది కూడా.

కాబట్టి నువ్వు చేసింది తప్పేమో అన్న భావన లోనుంచి బయట పడు.

ఇక సునీల్ విషయానికి వస్తే – నిన్ను ప్రాణంలా చూసుకుంటాడు కాబట్టి జయేంద్రకి నువ్వు సహాయం చేసే క్రమంలో నువ్వు ఏదైనా చిక్కుల్లో పడితే దేశం కాని దేశంలో ఏమయ్యుండేది అని కంగారు పడిఉండవచ్చు. ప్రేమగా చూసుకునే మనిషి దొరకడం నీ అదృష్టం, విల్లార్డ్ హార్లే వ్రాసిన "హిస్ నీడ్స్ హర్ నీడ్స్" అని పుస్తకం తెచ్చుకుని ఇద్దరూ చదవండి. అందులో హార్లే అంటాడు – అద్భుతమైన బంధం అంటే

ఇద్దరూ ఒకేలా ఆలోచించి ఒకే పని చెయ్యడం కాదు. ఒకరి ఆలోచనలని, అభిప్రాయాలని ఇంకొకరు నచ్చిన వాటిని అభినందిస్తూ నచ్చని వాటిని కూడా స్వీకరిస్తూ, మంచిని ప్రోత్సహిస్తూ చెడును విమర్శిస్తూ, ఒకరికి ఒకరు ఆలంబనగా ఉండడమే అని.

మంచి పని చెయ్యడానికి పర్మిషన్లు అక్కర్లేదు అలాగని చెప్పి చెయ్యడము తప్పు కాదు. అలాగని ఒకరికి నచ్చేలా ఇంకొకరు ప్రవర్తించి తీరాలి అనుకోవడం అవివేకం కూడా. చంద్రుడికి కూడా మచ్చ ఉంటుందమ్మా, మంచి చెడు మనలో భాగమే, మంచిని గ్రహిస్తూ చెడుని నిగ్రహిస్తూ క్షీర నీర న్యాయం పాటించి జీవితాన్ని నందనవనం చేసుకోండి. చిన్న చిన్న కుదుపులు సహజం. ఈరోజు ఇన్ని చెప్తున్న నేను కూడా డిప్రెషన్లోకి వెళ్లిన రోజులున్నాయి. మోహన్ ఎంతో వెన్నుదన్నుగా నిలిచి నన్ను మనిషిని చేసాడు' అంది రాధ.

"థాంక్యూ అక్కా.. నీతో మాట్లాడిన ప్రతీ సారీ.. ఒక పుస్తకం చదివిన భావన.. నాకు సరియైన పని అనిపించే సహాయం చేశాను. కానీ సునీల్ ని బాధ పెట్టాను అని అర్థమయ్యాక విలవిలలాడిపోయాను. ఇప్పుడే ఆ బుక్ ఆర్డర్ చేస్తా. నువ్వు నాకు అక్క మాత్రమే కాదు అమ్మ లాంటి స్నేహితురాలు కూడా"

అని ఫోన్ పెట్టేసింది సోనీ.

క్రిందటి వారం తన అంతర్మథనం మదిలో మెదిలింది రాధకి.

మోహన్ రుక్మిణిని కలిసాడనీ, తనతో మాట్లాడాడని తను పొసెసివ్ గా ఫీల్ అయ్యిందా లేకపోతే తన మోహన్ కి ఒకప్పుడు ప్రాణసమానమైన అమ్మాయి కలవగానే తనకి దూరం అయిపోతాడని బెంగ పడిందా – ఇంకా డిబేట్ చేస్తూనే ఉంది రాధ. కానీ మోహన్ కెనడాలో ఉన్న వారం రోజుల పాటు రాధ కూడా చాలా అంతర్మథనానికి లోనయ్యింది. మోహన్ అక్కడ నుంచి వచ్చాక తను క్లుప్తంగానే చెప్పినా అర్థం చేసుకోగలిగింది తను. కెనడా నుంచి వచ్చినప్పటి నుంచీ మోహన్ రోజూ రుక్మిణితో మాట్లాడటం, తన ముందు ఆ అమ్మాయి వ్యక్తిగత విషయాలు ఏవీ చర్చించక పోవడం రోజూ మామూలైపోయినా రాధ కల్పించుకోకుండా వాళ్లకి ఆ తావు ఇచ్చింది. అర్థం చేసుకోడానికి అపార్థం చేసుకోవడానికి అంతరం చాలా చిన్నది, కానీ చాలా బలీయమైనది కదా.

మాటల్లో మోహన్ రుక్మిణిని కూడా ఇక్కడికి వచ్చేయని చెప్పానని చెప్పడంతో తనకి కొంత ఆశ్చర్యంగా అనిపించినా మోహన్ వ్యక్తిత్వం తెలుసు కనుక ఏమీ ప్రశ్నించలేదు. ఆలోచనల్లో ఉండగానే స్పాటిపై మళ్ళీ మొదలైంది దానితో పాటే మోహన్ కార్ సౌండ్ కూడా.

అయ్యినట్టున్నాయి ఆటలు అయ్యగారికి అనుకుంటూ లేచింది రాధ. తనలో తనకే తెలియని వ్యక్తిత్వాన్ని తట్టి లేపిన వాడివి నువ్వే కదా అన్న చిరుగర్వం తొణికిసలాడుతున్న చిరునవ్వుతో.

"మహారాణి వారికో శుభవార్త. రెండు వారాలు వెకేషన్ ప్లాన్ చేసాను. క్రూజ్ కి వెళ్తున్నాం. రుక్మిణి తన పిల్లలు కూడా మనతో పాటు వస్తున్నారు. నవంబర్ మూడో వారం, నాలుగో వారం. తమరు కూడా లీవ్ కంఫర్మ్ చేస్తే.." అంటూ లోపలికి వచ్చాడు మోహన్.

ఒక్కసారి మోహన్ వైపు చూసి నవ్వింది రాధ.

"అబ్బో.. మాస్టారు బాగా హుషారు మీద ఉన్నారే" అంటూ

"రుక్మిణి నిన్ను అడిగి బుక్ చెయ్యమంది రాధా. నీ వ్యక్తిత్వం గురించి తెలుసు కనుక నమ్మకంగా చెప్పాను, వి ఆర్ గోయింగ్ అని. తన డెలికసీ నాకు అర్థమయినా తనని నాకన్నా ఎక్కువగా నువ్వు ఆదరించగలవు అన్న నమ్మకం నాకుంది. రుక్మిణికి మనం అవసరం రాధా. నీకు కొంత స్నేహం ఏర్పడకుండా రుక్మిణిని ఇక్కడ మూవ్ అవ్వమనలేను కదా అందుకే ఈ క్రూజ్ ప్లాన్" అన్నాడు మోహన్ వెనుకనుంచి భుజం చుట్టూ చేతులు వేస్తూ.

వెనక్కి తిరిగి గుండెపై తలవాల్చి – "మీరు చేస్తున్న పని మంచిది అనుకున్నప్పుడు మీకు నా పర్మిషన్ అక్కర్లేదు మోహన్. ఐ నో యూ"

పాట సాగుతోంది.. తెలుగు వారికీ శాశ్వత నిధిలాంటి దిశానిర్దేశం చేస్తూ
తన వేళ్ళే సంకెళ్ళై కదలలేని మొక్కలా,
ఆమనికై ఎదురు చూస్తు ఆగిపోకు ఎక్కడా..
అవధి లేని అందముంది అవనికి నలు దిక్కులా,
ప్రతి రోజొక నవగీతిక స్వాగతించగా
వెన్నెల కిన్నెర గానం నీకు తోడుగా

(వచ్చే నెల మరో మోహనం)

Post your comments